
క్లుప్తంగా

కల్యాణ కానుక అందజేత

దాచేపల్లి : చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పిటల్ ఆధ్వర్యంలో నూతన వధువు వధువుకి కల్యాణ కానుకను సోమవారం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని షేక్ అబ్దుల్ నభీ, మహాబీ కుమార్తె మస్తాన్‌బీ వివాహం సందర్భంగా బంగారపు ఉంగారం, పట్టుచీరె, సారెను డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అందించారు. పార్టీలు, కులాలకు అతీతంగా తమ ట్రస్ట్ ద్వారా కల్యాణ కానుక అందిస్తున్నామని, నిరుపేద వర్గాలకు చెందిన వారు తమను సంప్రదిస్తే ఈ కానుక అందిస్తామని డాక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



దాచేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ-2 పినకపాని అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఏలియంపేట కాలనీ ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులతో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా ప్రభుత్వం అవకాశాలు కల్పించిందని, విద్యార్థులు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ చెప్పారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా రుచికరమైన ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలన్నారు. ఈ తనిఖీల్లో ప్రధానోపాధ్యాయుడు వట్టెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు పద్మావతి ఉన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో కారెంపూడి విద్యార్థిని ప్రతిభ

కారెంపూడి: స్థానిక వివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూల్ ఐదవ తరగతి విద్యార్థిని సీహెచ్ స్ఫూర్తి నైనా అండర్ 11 రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎం ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. గత ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో స్ఫూర్తి నైనా అండర్ 11 విభాగంలో విజేతగా నిలిచిందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



దాచేపల్లి : స్థానిక ఎస్టీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కొనూరి రవికుమార్, ఉపాధ్యాయులు సుష్మ, జీవితలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. తాము పనిచేసిన సమయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేశామని, పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని మాజీ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివయ్య, ఉపాధ్యాయులు రాములు, గుండా శ్రీనివాసరావు, వెంకటరమణ, రాఘవేణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి : రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. మండలంలోని కేసానుపల్లి రైల్వేగేట్ సమీపంలో సుమారుగా 45 సంవత్సరాల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి శరీరంపై బ్లూ కలర్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైల్వే స్టేషన్‌లో మద్యం సీసాలు స్వాధీనం



పిడుగురాళ్ల: రైల్వే స్టేషన్‌లో మద్యం సీసాలను తీసుకుని వెళ్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం జరిగింది. ఎస్ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు...పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడు బ్యాగ్‌తో అనుమానస్పదంగా ఉండడంతో అతనిని, బ్యాగ్‌ను పరిశీలించడంతో అతని బ్యాగ్‌లో నిషేధిత తెలంగాణ మద్యం సీసాలను గుర్తించారు. అందులో 180 ఎంఎల్ గల 60 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇతను దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన జి. సుందరరావుగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఎస్ఈబీ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే జగనన్న సురక్ష

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సర్టిఫికెట్‌ను అందచేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, సర్పంచ్

మంచికల్లు(రెంటచింతల): సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందజేసి వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని మంచికల్లు గ్రామంలో సర్పంచ్ పొట్లపాటి చంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్షేత్రస్థాయిలోనే వారికి అవసరమైన కుల, ఆదాయ, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తదితర ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన విప్లవాత్మకమైన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలను అందించి వారి సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడి కక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 71 ధృవీకరణ పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపాటి చంద్రారెడ్డి, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాచర్ల: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల రోజులు చేపట్టి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ కోరారు. సోమవారం పట్టణంలోని యాదవ బజారు సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష పథక కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ హాజరయ్యారు. ఇప్పటికీ పట్టణంలో పేదలకు అన్నీ పథకాలు అందిస్తున్న సీఎం జగన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలకు దక్కుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎవరైన ఉంటే సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, కమీషనర్ ఈవి రమణబాబు, కౌన్సిలర్లు మున్నా మురళీ, సచివాలయ కన్వీనర్లు పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న 22 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జగనన్న సురక్ష సభలో 150 అర్జీల పరిష్కారం

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో అధికారులు ప్రజల నుంచి వచ్చిన 150 అర్జీలను పరిష్కరించారు. వెంటనే వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. మొత్తం 155 దరఖాస్తులు రాగా అందులో 150 అర్జీలనే గ్రామ సభలో పరిష్కారం చేశారు. మిగిలిన ఐదు అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. వాటిలో బియ్యం కార్డు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు మంజూరుతో పాటు ఆర్ఓఆర్ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు 126 పంపిణీ చేశారు. గ్రామ సభలో గ్రామ సర్పంచ్ ఉన్నం రామాంజమ్మ, మాజీ సర్పంచ్ పంగులూరి రామకృష్ణయ్య, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాస్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది

దాచేపల్లి : ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగెడ గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటుగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పాలనా కొనసాగిస్తోందని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, తహసీల్దార్ టి. ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ శోభారాణి, సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, దైద నాగరాజు, ఎంపీటీసీ పోతుల కమలకుమారి, నాయకులు గొగిరెడ్డి వెంకటరెడ్డి, ఆరికట్ల మల్లారెడ్డి, దేవళ్ల వీరాస్వామి, బీరవల్లి శౌరెడ్డి, ఉప్పుతల నరసింహారావు, వట్టె రామచంద్రారెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, ఉప్పుతల యల్లయ్య, దేవళ్ల వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏఎంసి చైర్మన్ వెలిదండి గోపాల్

మాచవరం: మండలంలోని మోర్జంపాడు-1, మాచవరం-2 గ్రామ సచివాలయాల పరిధిలో నేడు మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల పరిధిలోని వలంటీర్లు చేపట్టిన ఇంటింట సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, దరఖాస్తుదారులు తప్పని సరిగా హాజరు కావాలని తెలియజేశారు.

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ అన్నారు. సోమవారం దుర్గి 1 సచివాలయ పరిధిలోని ప్రజలకు అవసరమైన ధృవపత్రాలను స్థానిక వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అందజేశారు. సరైన అవగాహన లేక మిగిలిన లబ్ధిదారులు, ఇతర సమస్యలతో ధ్రువపత్రాలను పొందలేని ప్రజలకు సీఎం జగన్ చేపట్టిన బృహత్తర కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె సమతా వాణి, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, ఎంపీటీసీ కటకం గోపాల్, జిఎల్ఎన్ గుప్తా, ఎఈ వెలుగొండారెడ్డి, ఎపిఓ జి వెంకటేశ్వర్లు, ఎటివై అమీర్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం, వీఆర్ఓ కోటేశ్వరరావు, ఎస్ రాజు, సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కపలవాయి శ్రీను, తోటకూర వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ బుబ్బా సీతారామిరెడ్డి, ఎంఎల్ఓ తోటకూర శంకర్, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.

వెల్దుర్తి: మండలంలోని పట్లవీడు, మిట్టమీది పల్లె గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై రెండు గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఉదయం 10గం''ల నుంచి సాయంత్రం 5గం''ల వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అక్కడికక్కడే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సచివాలయ పరిదిలోని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్లరూరల్: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఎస్సీ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు హాజరవుతారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

వర్షంతో రైతన్నల హర్షం



మాచవరం: ఈవారం వాతావరణ అనుకూలిస్తూ గత రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం జల్లులు కురవడంతో రైతన్నల మోములో హర్షం వ్యక్తం అవుతుంది. వర్షాలకు భూమి పదును కావడంతో పంటల సాగుకు రైతులు సన్నదం అయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి సాగు చేసేందుకు విత్తనం నాటారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా సుమారు 421 హెక్టార్లలో పత్తి సాగుకు విత్తనం నాటినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు మిర్చి సాగుకు నారుమళ్లు ఏర్పాటులో లీనమయ్యారు. కొందరు రైతులు నర్సరీలలో మిర్చినారు పెంచే పనిలో నిమగ్నమయ్యారు. వర్షంతో పొలం పనులు ఊపందుకున్నాయి.

ఏపీ వార్డు సచివాలయ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పులిబండ్ల



పిడుగురాళ్లరూరల్: ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డు సచివాలయ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పులిబండ్ల నరసింహారావు ఎన్నికయ్యారు. నరసింహారావు మండలంలోని వీరాపురం గ్రామ సచివాలయంలో విద్య, సంక్షేమ సెక్రటరీగా పని చేస్తున్నారు. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ విలేజ్ అండ్ సెక్రటరీ అసోసియేషన్ జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.


ప్రజా సేవతోనే సంతృప్తి



మేరాజోత్ హనుమంతు నాయక్‌ను శాలువాతో సత్కరిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

మాచర్ల: ప్రజా సేవలోనే సంతృప్తి ఉంటుందని శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్య వైశ్య వృద్ధాశ్రమంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో శాలువా కప్పి సత్కారం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ మాట్లాడుతూ మాచర్లలో ఎన్నో సేవా సంస్థలున్నాయని సేవా రంగంలో వాసవిక్లబ్ ముందంజలో ఉందన్నారు. ఉచిత నేత్ర వైద్యశిబిరాలు మొక్కలు నాటడం, విద్యార్థిని, విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, సామూహిక సీమంతాలు నిర్వహించడంలో వాసవి క్లబ్ సేవలు ఎనలేనివన్నారు. అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ హరిజన, గిరిజన సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన హనుమంతునాయక్ అన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సభ్యులు ముప్పవరపు నాగార్జున, పందిరి నరసింహారావు, పోలిశెట్టి చిన పిచ్చయ్య, ఓబులశెట్టి నాసరయ్య, పోలూరి సత్యనారాయణ, చుండూరు సత్యనారాయణ, వనిత క్లబ్ అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, ధనలక్ష్మి తదితరులున్నారు.

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా వెంకట్రామయ్య



జిల్లా కన్వీనర్‌గా వెంకట్రామయ్యను అభినందిస్తున్న ప్రైవేటు పాఠశాల డైరెక్టర్స్

పిడుగురాళ్ల: ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా పట్టణంలోని వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్. వెంకట్రామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. పట్టణంలోని వికాస్ స్కూల్ ప్రాంగణంలో పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 28 పాఠశాలల కరస్పాండెంట్, డైరెక్టర్లు పాల్గొని కొత్త యూనియన్‌కు పూర్తి మద్దుత్తు తెలపడం జరిగింది. కొత్త కార్యవర్గంలో జిల్లా కన్వీనర్‌గా ఎస్. వెంకట్రామయ్య, జాయింట్ సెక్రటరీ మౌంటీసోరీ సతీష్, పిడుగురాళ్ల మండల అధ్యక్షులుగా వంగా సతీష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఇ. గంగాధర్‌రావు, జనరల్ సెక్రటరీగా ఎస్. వెంకటరామయ్య, జాయింట్ సెక్రటరీగా జి. శ్యామ్‌కుమార్, ట్రెజరర్‌గా పిన్నెల్లి సుభానీలను ఎన్నుకున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



చర్చి నిర్మాణానికి రూ. 5లక్షల నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ సంక్షేమ నిధులు అందిస్తూ నూతన ప్రార్థనా మందిరాల నిర్మాణానికి లక్షలాది నిధులు అందిస్తున్న ఘనత మనదేనని ప్రభుత్వ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లచ్చంబావి గ్రామంలో నిర్మాణంలో ఉన్న చర్చిలకు రూ. 5లక్షల నగదు అందించి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలను అందరినీ ఒక చోటకు చేర్చి వారందరికీ దేవుని ఆశీస్సులందించాలన్న మహోన్నతమైన లక్ష్యంతో దైవ సేవ చేస్తున్న ప్రార్థన మందిరాల అభివృద్ధికి తాను ఎప్పుడూ అండదండలందిస్తున్నానన్నారు. నియోజక వర్గంలో ఇప్పటికే వందలాది చర్చిలకు కోట్లాది నిధులు అందించి వాటి అభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని తెలిపారు. అడిగిన వెంటనే చర్చి ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 5లక్షల నగదును అందించిన ప్రభుత్వ విప్ పీఆర్కేను చర్చి పాస్టర్లు దానియేలు, డేవిడ్ రాజు, బుల్లయ్య, గ్రామ పెద్దలు శాలువాతో, పూలమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, సర్పంచ్‌లు ఆకనబోయిన వెంకటేశ్వర్లు, నోముల కృష్ణ, కంబాల చిన వెంకయ్య, జింకల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రంగానాయక్, పాండయ్య, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మాచర్ల: నియోజక వర్గ రోటరీ క్లబ్ నూతన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి వైభవ్ రెసిడెన్సిలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ డైరెక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో రైతులకు, పేదలకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి రోటరీ ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న రోటరీక్లబ్ సేవలు ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారి కె శరత్ చౌదరి, బోర్డు డైరెక్టర్లు ఇక్కుర్తి శంకర్, కెసిపి జనరల్ మేనేజర్ వెంకటరమణ, జిల్లా సభ్యులు డా'' రామకోటయ్య, టి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షులుగా చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలి, కోశాధికారి పందిరి నరసింహారావుతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్తమ సేవలందించిన వారిని అభినందించారు.

నర్సరీ లైసెన్స్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి



పిడుగురాళ్లరూరల్: నర్సరీ లైసెన్స్ రిజిస్ట్రేషన్ కోసం త్వరగా దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యాన వన శాఖాధికారి పి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో రైతులు వేసిన నర్సరీలను సందర్శించడం జరిగింది. నర్సరీల చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు రక్షణ కల్పించాలన్నారు. షెడ్‌కి డబుల్ డోర్ సిస్టిమ్ కలిగి ఉండాలని రైతులకు సూచించారు. నెట్ హౌస్‌లో పైన ఉన్న నెట్‌లోపలకు కీటకాలు ప్రవేశించకుండా చూడాలన్నారు. నర్సరీ యజమానులు విత్తనాలు కొనుగులు చేసే సమయంలో విత్తనాల ప్యాకెట్‌పై విత్తన రకం, లాట్ నెంబర్, కంపెనీ లెబుల్ తప్పనిసరిగా గమనించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏఓ



మాచర్ల: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రైవేటు విత్తనాలు, ఎరువుల షాపును సోమవారం మాచర్ల మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి తనిఖీ చేశారు. ప్రతి షాపులో విత్తనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు ఉన్నాయాని ఆరా తీశారు. ప్రతి షాపులో అమ్మకం చేసే విత్తనాలు, ఎరువులు రికార్డుల పరంగా పరిశీలించి స్టాకులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



వెల్దుర్తి: వలంటీర్ల పై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నీచపు ఆరోపణలు చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా సేవలందిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించి వైఎస్సార్ సీపీకి మంచి పేరు తీసుకురావడంతో పవన్ జీర్ణించుకోలేక వలంటీర్లు, ఆడపిల్లలను అక్రమ రవాణ చేస్తున్నారంటూ వలంటీర్ల పై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమన్నారు. హైవే రోడ్లమీద ఆవేశపడి ఎవరో రాసిచ్చిన నాలుగు టెక్నికల్ పదాలు వాడితే సామాన్యుని జీవితం అర్ధమవ్వదని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక శాఖల్లో ఏ ఒక ప్రక్రియకూ చెందని ఒక సినిమా నటున్ని, హ్యూమన్ ట్రాఫికింగ్‌కు సంబంధించి ఒక రాష్ట్ర ప్రజల్ని జాగ్రత్తం చేయమని దేబిరించే స్థితికి భారతదేశ నిఘా వ్యవస్థ దిగజారిందాని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలన్నారు.



రహదారిపై పవన్ చిత్రాలను దగ్ధం చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వలంటీర్లు



పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

రెంటచింతల: ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరోనా మహ్మారి సమయంలో స్వచ్చందంగా ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచి సేవలను అందించిన వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ చౌడేశ్వరి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తు అనేక దేశాల ప్రతినిధులచే మన్ననలను పొందిన వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఎంతో బాధాకరమన్నారు. ఇప్పటికైన పవన్‌కళ్యాణ్ నీచమైన రాజకీయాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు బోనం బూర్దుమరెడ్డి, జక్కా సౌజన్య, కొండాటి రాజు, డి.మనోజ్‌రెడ్డి, పోలూరి సుజాత, ఆడేపు శైలజ, తంగిరాల లత, రత్నారెడ్డి, డి.శ్రీనివాస్, దేగల రమేష్, బి.ప్రమీల, కె.సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: వలంటీర్లను అగౌరవ పరిస్తే భవిష్యత్‌తో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు పుట్టగత్తులు ఉండవని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ కరోనా సమయంలో రక్త సంబంధికులే దగ్గరకు వెళ్లలేని పరిస్థితిలో రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు అందరు తమ ప్రాణాలను పనంగా పెట్టి కరోనా రోగులకు సేవలు అందించడంతోపాటు వారికి కావాల్సిన ఆహార పదార్థాలను అందించారు. 1వ తేదీ ఉదయానే సూర్యోదయానికి ముందుగానే వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి టంఛన్‌గా వారి వద్దకు వెళ్లి ఇస్తున్నాం, ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా సేవలు అందిస్తున్నాం, మా సేవలను గుర్తించి ప్రధాన మంత్రే వలంటీర్ వ్యవస్థ భేష్ అని కితబు ఇచ్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా, వర్గాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్వేలు నిర్వహించి ప్రభుత్వానికి అందజేస్తున్నాం, అటువంటి మాపై పవన్ కల్యాణ్ మా సర్వే వల్ల ఒంటరి మహిళలు అదృశ్యమవుతున్నారని తెలపడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో రాజకీయ భవిష్యత్ లేకుండా పోతుందని వలంటీర్లు ముక్తకంఠంతో తెలిపారు.

దళిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

మాచర్ల రూరల్: దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని దళిత న్యాయ పోరాట సమితి కన్వీనర్ పోలేపల్లి అబ్రహం లింకన్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాలు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలల క్రితం ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను అదే పాఠశాలకు చెందిన వార్డెన్ యద్దనపూడి శ్రీనివాసరావు అత్యాచారం చేసిన కేసులో సరైన న్యాయం ఇంత వరకు జరగకపోవడం పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు పై చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు తగు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పిడిఎం రాష్ట్ర అధ్యక్షుడు కె శ్రీనివాసరావు, ఎంసిపిఐ జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం బాబురావు, సిపిఎం కార్యదర్శి డి మహేష్, గాలి సాంబశివరావులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com